# నేనూ - అన్నపూర్ణా

నేను మూడో ఫారం చదువుకునే రోజుల్లో అన్నపూర్ణ వేరు. నే చదువు ముగించి పెళ్ళిగట్రా చేసుకుని వుద్యోగాదులు ముగించేక నాకళ్ళయెదుట నిలచిన అన్నపూర్ణ వేరు.

నే చిన్నపిల్లగా వున్నప్పుడు మా తాతకి యిష్టదైవం అన్నపూర్ణ. - కాశీ అన్నపూర్ణ. మా నాన్న రసికాగ్రేసరునిగా చెలామణి అవుతుండే అష్టయిశ్వర్యాలూ యిట్టే స్వాహాచేయింపించిన అన్నపూర్ణ వేరు. ఆవిడ ఆ రోజుల్లో పేరుమోసిన బోగంపడుచు. మా అమ్మ తెల్లని చీరకట్టితే, నాన్న అమ్మకి మల్లెపూలు తెస్తే చూడలేని, చూసీ నోరు మూసుకోలేని అన్నపూర్ణ - అమ్మ ఆడబడుచు, ఇందరన్నపూర్ణలని తెలిసినా, నాకు తెలిసిన అన్నపూర్ణ మాత్రం ఒక్కత్తే...ఆవిడే నేను మూడో ఫారం చదువుకుంటూంటే చక్కని చుక్కలా అలంకరించుకుని అందరికళ్ళు కుట్టించే అన్నపూర్ణ. భర్తపాలిటి కల్పతరువు. చెప్పొచ్చే దేమిటంటే ఆనాటి అన్నపూర్ణకీ యీనాటి అన్నపూర్ణకీ పోలికల్లేవు.

ఎలాగైనా అన్నపూర్ణ నాతో మాట్లాడితే బాగుండును. నన్ను తను కూడా తిప్పి అందరికీ పరిచయంచేస్తే బాగుండును అనిపించేది. ఆవిడ యిటు చూస్తే చాలు కడుపు నిండేది.

నా కోర్కెలన్నీ ఫలించేరోజు ఒకనాడు వచ్చింది. అన్నపూర్ణకి జబ్బుచేసింది. ఇంట్లో ఎవరూ లేని సమయం

చూసి జబ్బుచేసింది. అవసరానికి వెళ్ళి ఆదుకుని యిన్నాళ్ళుగా కోరుకొంటూన్న ఆవిడస్నేహం సంపాదించాను. మహావృక్షానికి పెనవేసుకున్న లత నయిపోయాను. కొన్నాళ్ళకి నేనే అన్నపూర్ణ ఆవిడే నేను. కాని పచ్చటి పంట ఎన్నాళ్ళు పండకుండా వుంటుంది? పండినపంట కోయ్యకుండా ఎలాగ? మా స్నేహం పండింది. పంటకోసే సమయం వచ్చింది.

అన్నపూర్ణ నెక్లెసు కొనుక్కుంది. దానితోపాటే ముఖమల్ రవిక కొనుక్కుంది. మైసూరు సిల్కుచీర కొనుక్కుంది. సిగచుట్టుకునే రింగు కొనుక్కుంది. అస్తమానం పువ్వులఖర్చులేకుండా కాగితపు మల్లెమొగ్గల దండ కొనుక్కుంది. నేనో! స్కాలరుషిప్పు సంపాదించి, కష్టపడి బియ్యే చదువుకుంటున్నాను. చీరెలూ, జాకెట్లూ కూడా చాకలాడికి వేసేటన్నికూడా లేవు. నగలసంగతి దేవుడెరుగు— కాలికి జోడేనా లేదు. ఏ అలంకరణా లేకపోయినా సిగేనా చుట్టుకుందాంఅనిపించేది. కాని అక్కడేమిటా వెధవ్వేషాలు అని కసిరేది. ఒక్కసారిగా అన్నపూర్ణకీ నాకు మధ్య సప్తసముద్రాల దూరం వచ్చింది. ఆవలిఒడ్డున ఆవిడా,యీవలి ఒడ్డున నేనూ అయిపోయాం.

అప్పటికీ యింతో అంతో నెల ఉద్యోగంలో సంపాదిస్తూన్న అన్నపూర్ణ మొగుడు హఠాత్తుగా పెరిగిపోయాడు. రెండుచేతులా సంపాదించడం మొదలుపెట్టాడు. ఇంతింతై అన్నట్లు మా యిద్దరిమధ్య దూరం యింకా యింకా పెరిగింది. చీకట్లో ఒక్కర్తెనీ పడుకుని నిద్రరాక ఆలోచనలు

దోమల్లా పీక్కుతింటున్నప్పుడు అనిపించేది—అన్నపూర్ణ ఐశ్వర్యం నా కెప్పుడు వస్తుంది ? అలాంటి భర్త నా కెప్పుడు వస్తాడు ? అని.

అన్నపూర్ణ యిటు చూడ్డం మానేసింది. చిన్న చిన్న బకుళ్ళడిగేది, ఆ పక్కింటివాళ్ళ నడుగుతూంది. ఇది నాకు సహించరానిదే అయినా తప్పలేదు. రోజులు మళ్ళీ ఎప్పుడు మారుతాయో అని జపంచేస్తూ కూర్చుంటే మట్టుకు తోస్తుందా ?

కాని వచ్చిందా రోజు. అదేటక ఆగస్టుపదిహేను. ఆరోజున ప్రొద్దున్నే స్నానంచేసి తీరుబడిగా వీధిగుమ్మంలో కూర్చున్నాను. నన్నుచూసి నవ్వింది. ఆరోజే పన్నెండు దాటేసరికి వాళ్ళ వీధిగుమ్మంలో కూర్చుని బాతాఖానీ కొడుతున్నాం. రాత్రి ఏడయేసరికి యిద్దరం స్వాతంత్ర్యదినోత్సవపు వేడుకలు చూడ్డానికి తయారవుతున్నాం. ముద్దుగా నాకు సిగ చుట్టింది. తనచేతిగాజులు నా కో జత వేసింది. వద్దంటూన్నా తన పాతజోళ్ళు నన్ను తొడుక్కోమని బలవంతంచేసింది. ఆనందపు టలలమీద వేడుకలు చూసి వచ్చాం. రాత్రి వాళ్ళింట్లో చేసిన కందిపచ్చడి మా యింట్లో, మాయింట్లో కాకరకాయ తియ్యపులుసు వాళ్ళింట్లో.

ఓ రెండు నెలలపాటు కాలేజీకి వెళ్ళడం కూడా యిష్టంలేకుండాపోయింది. కొన్ని గంటలైనా అన్నపూర్ణ ఎడబాటు సహించలేకపోయేదాన్ని. ఆదివారం వస్తే పండుగ. అన్నపూర్ణ భర్త, పాపం ! మంచివాడు. గడిగుమ్మందాటి బయటికి వచ్చేవాడు కాదు. నేనూ అన్నపూర్ణ కిల కిలా గల

గలా నవ్వుతుంటూ గంటల తరబడి మాట్లాడుకుంటూ వుంటే
వంటల్లో సహాయంకూడా చేసేవాడు. అంతటి ఉత్తముడు.
అంతటి ఉదారుడు.

కాని. మళ్ళీ ఏమొచ్చిందో అన్నపూర్ణలో, ముభా
వంగా వుండడం ప్రారంభించింది. వాళ్ళింటికి వెళ్ళబోతే
అక్క కోప్పడ్డంకూడా ప్రారంభించింది. ఎందుకే అంటే
చెప్పింది: వీధిలోకి వెళ్ళాలి గొలుసూ, గాజులూ ఎవ
విస్తుందట. "మా ఆయన తిడతాడు యివ్వను" అందిట
అక్క. దానితో పాపం ఆవిడ మనస్సు నొచ్చుకుంది
కాబోలు! "అదేవిటే ? ఓ గంటో రెండుగంటలో పెట్టుకుని
యిచ్చేస్తుందికదా ? పాపం! మొన్న మొన్నటిదాకా అన్నీ
పెట్టుకున్న మనిషి. బోసిగా వెళ్ళడానికి చిన్నతనంగా వుండ
దటే. "మామ్మో, దానితో పాటు నువ్వూ వుంచేసుకో" అనే
సింది అక్క. ఆశ్చర్యం. అక్కకెందుకూ యింతకోపం ?
నిజమే, డబ్బు అవసరానికితప్ప నగ లెందుకు? అన్నీ తాకట్టు
పెట్టి స్కూలు జీతాలు కట్టివుంటుంది. అలా ఎందుకూ
చెప్పడం అని, ప్రాణం విసుక్కుతోంది. పెట్లో పారేశాను
అంది. తప్పేముందీ? తప్పుఅక్కడే. తీరా కూర్చుని "రేడియో
వినపడ్డంలేదేమండీ ?" అంటే వస్తుందనూ? "మార్వాడీ
ఎంత ప్రాణంతీస్తోందండీ, అంచేత అరువిచ్చాను" అందిట
అన్నపూర్ణ. మంచి సమాధానం చెప్పింది అనుకున్నాను.

రోజులు గడుస్తూన్న కొద్దీ మళ్ళా మేం దూరం
అయిపోయాం. మా రోజులు మారాయి. అక్కడికి
నగలూ వస్త్రా చేకూరాయి. నాకు బియ్యేలో క్లాసురావడం,

తరవాత ఉద్యోగం దొరకడం, కొద్దిమాసాల్లోనే పెళ్ళి కావడం అన్నీ ఓ సంవత్సరంన్నరలో జరిగిపోయాయి. నేను అత్తవారింటికి వెళ్ళిపోయాను.

సంవత్సరాలు జరిగిపోతూంటే-ఆగస్టులూ-స్వాతంత్ర్య దినాలూ ఆగుతాయా ! నాలుగు - ఐదు - ఆరు - ఆగస్టులు వెళ్ళాయి. అన్నపూర్ణని యీ ఆరు ఆగస్టులలోనూ చూసి నదే బహు కొద్ది.

అక్కకి ఒంట్లో బాగులేదంటే నాసంతానంతో సహా బయలుదేరి వచ్చాను. మళ్ళీ ఆగస్టే వచ్చింది. ఏవేవో వూహాలు నాలో చెలరేగి ఎన్నెన్నో ప్రశ్నలు వేధించాయి. అన్నింటికీ అక్కకి సమాధానం చెప్పే ఓపికలేదు. కాని క్లుప్తంగా అన్నివిషయాలూ చెప్పింది. అన్నపూర్ణకి ఒక విధంగా రోజులు మారాయి. రెండు చేతులా భర్త సంపాదించడంలేదు. ఏదో గుప్తంగా కాలక్షేపంచేస్తున్నారు. వెన్నెల విసనకర్రలాంటి అన్నపూర్ణ నవ్వితే భూనభోంతరాళాలు దద్దరిల్లజేసే అన్నపూర్ణ, అందరిని అన్నీ అని మత్తగజంలా ముందుకు సాగిపోయే అన్నపూర్ణ యీనాడు లేదు. అన్నపూర్ణకి అందమైన చీరలులేవు. కాని నిగనిగ మెరిసే శరీరం మటుకు మాయలేదు. నవ్వడానికితగ్గ ప్రశాంతత లేదు. కాని నవ్వడం అలవాటు పోలేదు. ఎవరినిపడితే వారిని ఎంతటి మాటైనా ముఖంముందు అనే ధైర్యం పోయింది. అందుకే వారిదగ్గిరా వీరిదగ్గిరా అనే అలవాటు పోలేదు.

ఆగస్టు పదిహేను ఉదయం స్నానాదులు ముగించి కూర్చున్నాను. ఆనాటి ఆగస్టులాగే యిదీ, ఆనందంగా

ముసుస్తుండా అన్న ఆలోచనలు ఉప్పెనలాగ వస్తున్నాయి. కాని...ఎంత కాదనుకున్నా ఆనాటి అన్నపూర్ణకి దృష్టి భవిష్యత్తుమీద, ఈనాటి అన్నపూర్ణకి దృష్టి గతంమీద. అన్నపూర్ణకి ముందుకుపోయే అవకాశం లేదు. వెనకకి పోతే గొయ్యి అన్న సంగతి తెలుసు. అయితేనేం? గోతిలో, తాను తవ్వుకున్న గోతిలో తనే పడ్డం, అందులో నిక్షేపాలు కోకొల్లలు అంటూ తృప్తిపడుతుంది. అందరికీ చెప్తుంది. అది ఆగస్టు పదిహేను. అందుకే అన్నపూర్ణ జ్ఞాపకంవస్తుంది నాకు. మరి నేను జ్ఞాపకం వస్తానో రానో అన్నపూర్ణకి.